క్లుప్తంగా

హాస్టల్ విద్యార్థులకు ఫ్యాన్ల వితరణ



సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: కాలేజీ హాస్టల్ విద్యార్థుల అవసరాలు తీర్చడానికి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కృషి చేస్తుందని యూనియన్ సెక్రటరీ లక్ష్మీపతిరావు తెలిపారు. బ్యాంకుల జాతీయకరణ 56వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యాన తమ్మలావలోని వెనుకబడిన తరగతుల కాలేజీ బాలికల హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 జులై 19న బ్యాంకుల జాతీయకరణ నిర్ణయం భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ముఖ్య ఘట్టమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి, మురళీధర్, రమేష్, సోమరాజు, అప్పారావు, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, సూర్య, కిశోర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువుల అందజేత

కడియం: మండలంలోని దుళ్ల, వీరవరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో శాశ్వత భవనాలున్న తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌ఈడీ లైట్లు, టీవీలు, వాటర్ ప్యూరిఫయర్లు, పీపీ 1, పీపీ 2 పుస్తకాలు, ఐదు రకాల ఆటవస్తువులను శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నున్నా నాగలక్ష్మి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా దుళ్లలో గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ కేంద్రాల్లో పిల్లల అవసరమైన వస్తువులను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో వీటిని ఆయా కేంద్రాలకు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, స్థానిక నాయకులు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, బూడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ముసలమ్మ ఆలయానికి భక్తుల వెల్లువ

కడియం: వివిధ ప్రదేశాల్లోని ఆధ్యాత్మిక కేంద్రాల సందర్శనకు బస్సులు ఏర్పాటు చేయడంలో రావులపాలెం ఆర్టీసీ డిపో ముందంజలో ఉందని ఆ డిపో మేనేజర్ వైవీ కుమార్ అన్నారు. కడియపులంకలోని ముసలమ్మ ఆలయాన్ని శనివారం పది బస్సుల్లో వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వారితో పాటు మేనేజర్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ ఉన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో అష్ట దేవీల దర్శనం పేరుతో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ యాత్రకు భక్తుల స్పందన బాగుందన్నారు.

చీరలు, దుప్పట్ల వితరణ



మహిళకు చీర అందజేస్తున్న ఫ్రాన్సిస్ రాజ్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ ఏ బ్లాకులోని ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సుబేదార్ మేజర్ కొండాపు శామ్యూల్ క్రిష్టోఫర్ పేరు మీద ఫ్రాన్సిస్ రాజ్ కుమార్ వీటిని అందించారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి మేజర్ క్రిష్టోఫర్ దేశానికి, సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఏబీసీ కంప్యూటర్స్ అధినేత కుసుమ సాయిబాబా, ఫ్రాన్సిస్ రాజకుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఎ.కృష్ణమోహన్, కుసుమ కుమారి, ప్రొఫెసర్ శాండీ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

కంబాలచెరువు: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలంటూ వై.జంక్షన్ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయన్నారు. చాలా హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తూర్పుగానుగూడెంలోని బస్టాండ్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు కనుగొన్నారు. గ్రామ వీఆర్వో ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిశితంగా పరిశీలించారు. అయితే ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా మారిపోయింది. అతడి ప్యాంటు జేబులోని ఆధార్ కార్డు ప్రకారం అతడి పేరు రొక్కం గిరిధర్, వయసు 40, గజపతి విలేజ్, ఒడిశా అని తెలుస్తోంది.

నగరంలో చిట్టడవి

- అడవిని తలపిస్తున్న తూర్పు రైల్వేక్వార్టర్లు
- విపరీతంగా పెరిగిన తుప్పలు
- రాకపోకలకు భయపడుతున్న ప్రజలు



తూర్పు రైల్వే క్వార్టర్లలో పెరిగిన తుప్పలు



తూర్పు రైల్వేక్వార్టర్ల రోడ్డు



తుప్పల మధ్య నుంచి రైల్వే కార్మికులు ఆఫీసుకు వెళ్లే రోడ్డు



నెల రోజులుగా మూతపడిన స్కాట్ అండ్ గైడ్ డెన్

రాజమహేంద్రవరం రూరల్: సాయంత్రం ఐదు గంటలు దాటితే చాలు ఆ ప్రాంతానికి వెళ్లాలంటే భయంగా ఉంటుంది. చెట్లు, పొదలతో నిండిపోయిన ఆ దారిలో నడవటానికి దడ కలుగుతుంది. పిచ్చి పొదలలో విష సర్పాల సంచారంతో పాటు రాత్రీ పగలూ అనే తేడా లేకుండా మందుబాబులు అక్కడ కనిపిస్తారు. ఇదేదో రంపచోడవరంలోని ఏజెన్సీ ప్రాంతం కాదు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని తూర్పురైల్వే క్వార్టర్ల పరిస్థితి. ఇటీవల ఇక్కడ ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే 16 రోజుల వరకూ అక్కడ మృతదేహం ఉన్న సంగతి బయటకు రాలేదు.

శిథిలమైన క్వార్టర్లు

రాజమహేంద్రవరం తూర్పు రైల్వేక్వార్టర్ల ప్రాంతంలో శివాలయం, రైల్వే శాఖకు చెందిన కార్యాలయంతో పాటు పాడుపడిన క్వార్టర్లు, భారీ వృక్షాలు దర్శనమిస్తుంటాయి. శివాలయానికి వచ్చే భక్తులతో పాటు రాజమహేంద్రవరానికి వెళ్లే వాహనచోదకులు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో ప్రయాణించడానికి ప్రజలు భయపడతారు. ఈ ప్రాంతంలోనే స్కాట్ అండ్ గైడ్ డెన్ కార్యకలాపాలు జరుగుతుండేవి. వాటి కారణంగా రాకపోకలు, జన సంచారం బాగానే ఉండేది. అయితే రైల్వే అధికారుల సమన్వయం కారణంగా స్కాట్ డెన్ సైతం నెల రోజులుగా మూతపడింది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు బాగా తగ్గిపోయాయి. ఇటీవల ఒక వ్యక్తి స్కాట్ డెన్‌లో బెంచీపై ఆత్మహత్యకు పాల్పడితే 16 రోజుల వరకూ మృతదేహాన్ని గుర్తించలేదంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలు

అడవిని తలపిస్తున్న తూర్పు రైల్వే క్వార్టర్ల ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. అంతే కాకుండా ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మందుబాబులు ఇక్కడ కనిపిస్తున్నారు. పోలీసులు గస్తీ తిరుగుతున్నప్పటికీ వారికి భయం ఉండడం లేదు. ఇక్కడ పాడుపడిన క్వార్టర్లలో గతంలో రెండు హత్యలు సైతం జరిగాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి తూర్పు రైల్వేక్వార్టర్లను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



వేమగిరిలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు మణిజ్యోత్స్న, జెస్సీ సుప్రియ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ సాధనలో భాగంగా టీబీ వ్యాధి అనుమానితులు వెంటనే కఫ పరీక్ష చేయించుకోవాలనిసూచించారు. ఈ మేరకు శనివారం ఉదయం వేమగిరి, వీరవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మధుమేహ బాధితులు, 60 ఏళ్లు దాటిన వారు, మద్యపానం/ధూమపానం అలవాటు ఉన్నవారు, పరిశ్రమలలో పని చేసేవారు, వృద్ధాశ్రమాల్లో ఉండేవారు కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ సూపర్ వైజర్ శేషు మాట్లాడుతూ టీబీ అనుమానితులకు కఫ పరీక్ష, ఛాతీ ఎక్స్‌రేలను కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రతినెలా వ్యాధి గ్రస్తుల బ్యాంక్ ఖాతాలో రూ.వెయ్యి జమ అవుతాయని, పౌష్టికాహారం కూడా అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తులసి, శ్రావణి, రీచ్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ వర్మ, సునీత, మల్లిక, అనుప్రసన్న, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కరదీపికలతో ఎంతో ప్రయోజనం

కంబాలచెరువు: ప్రతి విద్యార్థి అభ్యసన శైలికి అనుగుణంగా బోధించేందుకు ఉపాధ్యాయ కరదీపికలు ఎంతో ఉపయోగపడతాయని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ స్టాక్ పాయింట్ నుంచి శనివారం వాటిని ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఐ దిలీప్ కుమార్ మాట్లాడుతూ తరగతిలో ఉపాధ్యాయుని బోధనకు ఇవి మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయన్నారు. పాఠ్య ప్రణాళిక, డైరీ కోసం ప్రత్యేకంగా పుస్తకాలు పెట్టక్కర్లేదని, ఈ కరదీపికల్లోనే వాటిని పొందుపర్చారన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో కూడా వీటిపై చర్చ ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, ఇందిర, నాగలక్ష్మి, కోటేశ్వరి పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయని డీఎంహెచ్ స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రవికుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ఆ పాఠశాలలో శనివారం సంసిద్ధతా సమావేశం నిర్వహించారు. క్లస్టర్ కాంప్లెక్స్ అజెండా, సమయ సారణిని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఇకపై క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రతి నెలా మూడో శనివారం మధ్యాహ్నం ఒక పూట మాత్రమే జరుగుతాయన్నారు. ఉదయం అన్ని పాఠశాలలు యథాతథంగా పనిచేస్తాయన్నారు పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేసిన తర్వాత తరగతులు ఉండవని, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్‌ఎంటీ జయంతి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో చాటింగ్ ప్రమాదకరం

కంబాలచెరువు: తుమ్మలావ మున్సిపల్ స్కూలు, రాజమహేంద్రి కళాశాల విద్యార్థులు శనివారం సైబర్ నేరాలపై మూడో పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు శక్తి యాప్‌పై జిల్లా శక్తి టీం, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు పలు విషయాలను వివరించారు. సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు. అనవసర యాప్‌లు, లింకులు, ఈ-మెయిళ్లతో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా శక్తి టీం పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, శక్తి యాప్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ సురేష్, పి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

టీనేజ్ ప్రేమలతో అనర్థాలు

- డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్
- వసతి గృహం బాలికలకు అవగాహన



బీసీ హాస్టల్‌లో బాలికలతో మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

కంబాలచెరువు: టీనేజ్ వయసులో ప్రేమంటే ఎంతో ఆకర్షణ ఉంటుందని, కానీ దాని వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం బాలికల మనసు - వ్యక్తిత్వ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయసులో త్వరగా ప్రేమకు ఆకర్షితులవుతారన్నారు. ఆ సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రేమకన్నా జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్నేహాలు, సరదాలు, అల్లరి ఎంతో సంతోషాన్నిచ్చే అనుభూతులే అయినప్పటికీ, వాటికి హద్దుంటుందని గమనించాలన్నారు. బాలికలు తమ సామర్థ్యాన్ని గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావం, అసభ్యకర పోస్టులు, తప్పుడు సమాచారం, తప్పుడు స్నేహాల నుంచి ఎలా రక్షించుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్ కుమార్, హెచ్‌డబ్ల్యూవో వి.సత్యవాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేపరుమిల్లు ముడుపులపై సీఐడీ దర్యాప్తు కోరతాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం ఈ నెల 21 లోపు జరగని పక్షంలో సీఐడీ దర్యాప్తును కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తామని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయకుండా తాత్సారం చేస్తూ ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వం అధికారులు నోరెత్తకుండా ముడుపులు ముట్టచెబుతున్నారని ఆరోపించారు. పరంపర ఉద్యోగాలను సీనియారిటీ ప్రకారం ఇవ్వకుండా లక్షల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. పేపరుమిల్లు వల్ల గోదావరి జలాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరం.. జలమయం



వెంకటేశ్వర నగర్‌లో జలమయమైన రహదారి



శ్యామలా నగర్‌లో ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

సీటీఆర్ఐ: నగరంలో శుక్రవారం, శనివారాల్లో కురిసిన వర్షంతో ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభించింది. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 60.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. భారీ వర్షానికి నగర శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరంతా రహదారులపైకి చేరింది. సంజీవ నగర్, సుబ్బారావు నగర్, ఆర్యాపురం, వీరభద్రపురం, కోటిలింగాలపేట, క్వారీ మార్కెట్ సెంటర్, లాలాచెరువు సెంటర్, తాడితోట, దానవాయిపేట, వెంకటేశ్వర నగర్, టీటీడీ కల్యాణ మంటపం రోడ్డు, శ్యామల సెంటర్‌లో వర్షం నీరు రహదారులపై నిలిచిపోయింది. విమెన్స్ కళాశాల వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడ్డంతో వర్షం నీరు పోయే మార్గం లేకపోవడంతో అక్కడే తిష్ట వేసింది. మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎస్‌వీ జనరల్ మార్కెట్‌లో తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని ఎస్‌వీ జనరల్ మార్కెట్‌లో శనివారం సాయంత్రం ఎంపీడీవో కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మికంగా దాడులు చేశారు. నిబంధనలు పాటించని పలు దుకాణాలకు జరిమానాలు విధించి, ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తిస్థాయిలో నిలిపివేయాలన్నారు. ప్రజలు జ్యూట్‌బ్యాగులు, కాగితపు సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో తాడి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదానాలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి
- ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అన్నదానం నిర్వహించాలనుకునే దాతలు, ఎన్జీవో, స్వచ్ఛంద సంస్థలు ఇకపై నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శనివారం తెలిపారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పేదలు, అభాగ్యులకు అన్నదానం నిర్వహించడం ఎంతో పుణ్యకార్యమని, కానీ 48 గంటల ముందు తమ వార్డు సచివాలయాల పరిధిలో అనుమతి తీసుకోవాలన్నారు. దీని వల్ల ప్లాస్టిక్ ప్లేట్లు (సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్) నిషేధంతో పాటు ఆయా ప్రాంతాలలో ముందుగానే డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కనుక దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుగా వార్డు సచివాలయంలో పేరు, సంస్థ వివరాలను కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారి అనుమతి ఇచ్చిన అనంతరం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సాయంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేని ప్రదేశంలో అన్న వితరణ చేసుకోవాలన్నారు. అన్నదాన అనంతరం శానిటేషన్ సెక్రటరీకి సమాచారం అందిస్తే వ్యర్థాలను వాహనం ద్వారా సేకరిస్తామన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..

రాజమహేంద్రవరం సిటీ: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడానికి ప్రజలందరూ కలసి రావాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని వై.జంక్షన్ నుంచి సుబ్రహ్మణ్యం మైదానం వరకూ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో ఎస్ఏఎస్ఏ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ నెలలో ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం అనే నినాదంలో జరిపినట్టు తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు లభించిందని, ఈ అవార్డు మనకి రావడంతో మన బాధ్యతను మరింత పెంచిందన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌వీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా వెనక్కి తిరిగి ఇచ్చేస్తే, వారికి నగరపాలక సంస్థ ప్రోత్సాహక బహుమతి అందజేస్తుందన్నారు. దీని కోసం జాంపేట జంక్షన్, వీఎల్ పురం, దానవాయిపేటలలో ప్రత్యేక అవుట్ లెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఎంసీ ఆరోగ్యాధికారి డాక్టర్ వి.వినూత్న పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

కడియం: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కడియం విశాల సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ చైర్మన్ వెలుగుబంటి రఘురామ్, సభ్యులు ముద్రగడ సుధ, టి.వరహాలరాజు కోరారు. ఈ మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, షాపుల్లో పోస్టర్లు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డీఎం అండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను శుభ్రం చేశారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ర్యాలీ నిర్వహించారు.

కడియం: పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని కలిసి కట్టుగా తరిమికొట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పిలుపునిచ్చారు. వేమగిరిలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ విక్రయాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు, వ్యాపారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ధవళేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు సూచించారు. శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు.

విష్ణుమూర్తికి మాజీ మంత్రి వేణు పరామర్శ



అరవాలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తిని శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) తదితరులు పరామర్శించారు. ఇటీవల విష్ణుమూర్తి మాతృమూర్తి అరవాలమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం అలీ, చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలి, యెనుముల త్యాగరాజు, శాటిలైట్ సిటీ గ్రామ నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు. అలాగే షేక్ మౌలాలి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి వేణు పరామర్శించారు.

మాజీ ఎంపీ భరత్‌రామ్ పరామర్శ



సునీల్ కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ కుమార్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ శనివారం పరామర్శించారు. సునీల్ కుమార్ అస్వస్థతతో నాలుగు రోజులుగా నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకునన భరత్ రామ్ ఆ హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. సునీల్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



రైల్వే స్టేషన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రైల్వే స్టేషన్ మేనేజర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎఫ్ ఎస్ఐ విశ్వనాథ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి అనంత ప్రదీప్, ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్, క్రాఫ్ కో ఆర్డినేటర్ బి.రాజకుమార్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ జూలై 30వ తేదీ వరకు రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు, పలు రైళ్లలో రెస్క్యూ ఆపరేషన్లు చేపడుతున్నట్లు తెలిపారు. అత్యవసర సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 139, 1098, 100కు కాల్ చేయాలని ప్రయాణికులకు సూచించారు.

మార్కెట్లోకి మహీంద్రా కారు విడుదల



మహీంద్రా కారును విడుదల చేస్తున్న రాధాకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి సురేష్

రాజమహేంద్రవరం రూరల్: మహీంద్రా అధీకృత డీలర్ అయిన నగరంలోని ఎంఅండ్ఎస్ మోటార్స్‌లో శనివారం సాయంత్రం ఎక్స్‌యూవీ3ఎక్స్‌వో రెవెక్స్ పెట్రోల్ వేరియంట్‌ను ఆ సంస్థ ప్రతినిధులు రాధాకృష్ణ, లక్ష్మీ, శ్రీరాం, జిల్లా రవాణాశాఖాధికారి ఆర్.సురేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆధునికమైన ఫీచర్లతో కూడిన ఈ కారు ధర రూ.8.94 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు. పెట్రోల్ రెవెక్స్ కారు రెండు ఇంజిన్లు, మూడు వేరియంట్లతో అందుబాటులోకి వచ్చిందన్నారు. బ్లాక్ లెదర్ సీట్లు, రేర్ ఏసీ వెంట్, సింగిల్ పేన్ సన్‌రూఫ్, ఆడియో కంట్రోల్స్ ఆన్ స్టీరింగ్ వీల్, బ్లాక్ కలర్డ్ స్టీల్ వీల్స్, అడ్రెనాక్స్, క్రూస్ కంట్రోల్, రియర్ కెమెరా, వైర్‌లెస్ చార్జర్ తదితర ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, సంస్థ జీఎం రాజా, సేల్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంపై దాడి

కంబాలచెరువు: కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంపై శనివారం కొందరు దాడి చేశారు. దీనిపై మఠం మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ కనుమెలు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన ఉల్లి సంతోష్ రెండేళ్లుగా రామకృష్ణ మఠానికి వస్తున్నాడు. అక్కడ నిత్యం పుస్తక పఠనం చేస్తున్నాడు. అతడు ధ్యానంలో పూర్తిగా ఆధ్యాత్మికతలోకి వెళ్లిపోయాడు. దీంతో అతడి కుటుంబీకులు, అత్తింటివారు సుమారు 20 మందిపైగా రామకృష్ణ మఠంలోకి చొచ్చుకెళ్లి ఆందోళన చేశారు. సంతోష్ అలా తయారవ్వడానికి మీరే కారణమంటూ మఠంలోని వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో మఠం నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించారు.